


RSK012B145

ఓం

భైరవయ్య

స్పందన డిస్ట్రిబ్యూటర్స్
1-8-17/2 చిక్కడపల్లి
హైదరాబాదు-20.

పంథొమిదొందల డెభ్భై ఆఖరునెలలో
హైదరాబాదు సన్‌ప్రెస్, చిక్కడపల్లిలో
వేయి ప్రతులు లచ్చుపడ్డాయ్

అట్టమీద రంగులు పులిమింది శీలా వీర్రాజు

రెండువందల యాభై పైసలుంచే ఈ పుస్తకం మీది

కావాలంటే :

స్పందన డిస్ట్రిబ్యూటర్స్
1-8-17/2 చిక్కడపల్లి
హైదరాబాదు-20

ఇవి
మనిషిలో
ఇంకా చావకుండా మిగిలివున్న
నిజాయితీకి
తిరుగుబాటు తత్వానికి—

ఇందులోనికొన్ని కవితలు పత్రికలలో ప్రచురింపబడ్డాయి
ఆయా పత్రికాధిపతులకూ,

చక్కని భావగర్భితమైన ముఖచిత్రాన్ని వేసిచ్చిన
మిత్రుడు శీలా వీర్రాజుకూ రచయిత కృతజ్ఞుడు —

పంథొమ్మిది వందల నలభై రెండులో
ఈ నిప్పురవ్వ దూకినప్పుడు
ఆకాశం కళ్ళనిండా కాటుక పూసుకుంది
పిడుగులు పడ్డాయి
నక్షత్రాలు ఏడ్చాయి
గోదావరి సుళ్ళుతిరిగిన దేశంలో
నరసాపురం వీధుల్లో
మురుగ్గుంటలకు మూలస్థావమైన బెజవాడలో
హైదరాబాదు రాచవీధుల్లో
చదువుకుంది
ప్రపంచంలోకి ప్రస్థానం ఇష్టం
గుండెలో అగ్నిపర్వతాలుబద్దలైనా నవ్వడం మరీ ఇష్టం
స్మశానంలో చెంగల్వలు పుట్టించడం కోర్కె
అయోమయంలో లయమవుతున్న
ఈ ప్రపంచం మారాలంటే
ప్రతిమనిషీ ఒక అగ్నికణం కావాలంటుంది
ఈ నిప్పురవ్వ —

వచ్చేవుందు.....

మొదట్నుంచీ నేను మొండివాణ్ణి. నమ్మిన నిజాన్ని నిర్భయంగా చెప్పడమే తప్ప నంగిమాటలు తెలియని వాణ్ణి. అందుకే కవిగా మారాను. ఈనా దేశప్రజల్ని నిలువునా దోపిడీచేస్తున్న శక్తుల్ని చూసి, గుండెలు కుతకుత ఉడుకెత్తేవి. వీళ్ళందర్నీ నమిలి మింగెయ్యాలన్నంత ఆవేశం వచ్చేది. యువతరం నిస్సారంగా తమ జీవితాలు గడిపేస్తోంటే విపరీతమైన ఆవేదన కలిగేది. ఏవిధంగా కొన్ని శతాబ్దాలుగా నిర్మాణమైన జాతిని మేల్కొలపడమా అని ఆలోచిస్తూ వుండేవాణ్ణి. ఆ నా ఆలోచనలకీ ఆవేదనకీ రూపమాత్రాన్ని కల్పించినవాడు శిష్టా జగన్నాథం (నవత). ఆ రూపానికి ఎముకలు, మాంసం సప్లైచేసి, నన్ను కవిగా నిలబెట్టింది దిగంబర కవితోద్యమం + నా అయిదుగురు మిత్రులూ.

నాకు మార్క్సిష్టు సూత్రాలు తెలియవని ఒక కవి మిత్రుడన్నాడు. నేను " దాస్ కాపిటల్ " అప్పజెప్పలేను. కమ్యూనిష్టు మానిఫెష్టో కంఠతా పట్టలేదు. జీవితం నా చుట్టూవున్న ప్రపంచం నాకు మార్క్సిష్టు పాఠాలు నేర్పింది. అన్యాయం అన్నది ఎక్కడున్నా. ఏ రూపంలోవున్నా ఎదిరించి నిలబడమని చెప్పింది.

నిజం చెప్పడానికి భయపడ నక్కరలేదనీ నిజాన్ని సూటిగా, నగ్నంగా చెపితేనే దాని విలువ పెరుగుతుందనీ చెప్పింది. ఈ భారతదేశంలో నేడు బతుకుసాగిస్తున్న ప్రతి సామాన్యవ్యక్తీ, ఒక్కక్షణం తన గానుగెద్దు జీవితంలోకి చూసుకుంటే తనే మార్క్స్, తనే లెనిన్ అవుతాడు.

కవిని క్రాంతదర్శకుడన్నారు. ఏ దేశంలో ఏ విప్లవం వచ్చినా సాహిత్యం ద్వారానే వచ్చింది. ఏ జాతిలో చైతన్యం కలిగినా సాహిత్యంవల్లనే. ఎందుకంటే సాహిత్యం మనిషి మెదడుని చీల్చుకుని అతని ఆలోచనా తరంగాలనిలేపి కార్యోన్ముఖుణ్ణి చేస్తుంది. అతనిలో నిద్రిపోతున్న శక్తుల్నిలేపి ముందుకు దూకిస్తుంది. ఇందుకు దిగంబర కవిత్వమే నిదర్శనం. స్తబ్దుగా పడివున్న తెలుగు సాహితీరంగంలో చైతన్యం కలిగించి, సాహిత్యం ప్రజలసమస్యల్ని పట్టించుకునేట్టు చేసి, మత్తుగా పడివున్న యువతరాన్ని మేల్కొలిపి అక్రమాల్నీ, దౌర్జన్యాన్నీ ఎదుర్కునేట్టు చేసింది. ఆ నా యువతరపు ఉత్తేజమే నా కవిత్వానికి ఊపిరి.

నేను సాంప్రదాయంలో పుట్టి పెరిగాను. దాన్ని చీల్చుకుని ప్రపంచాన్నీ, దాని నిజస్వరూపాన్నీ చూడటానికి ప్రయత్నిస్తున్నాను. నేనుచూసిన భయంకర సత్యాల్ని నా కవితల్లో ప్రతిబింబించడానికి ప్రయత్నం చేశాను. నా కవితల్లో కొన్నిచోట్ల సాంప్రదాయకమైన ప్రతీకలు కనబడతాయి. అది నేను పెరిగిన సాంప్రదాయపు వాతావరణ ప్రభావమని అనొచ్చు, కాదొచ్చు

కాసీ, " నేను ఆ ప్రతీకలే ఎందుకు వాడాల్సొచ్చింది" అని నన్ను నేను ప్రశ్నించుకుని నాకు నేను చెప్పుకున్న సమాధానం.

" నేను కవిత్వం రాస్తున్నది తెలుగులో,
నేను చూసింది భయంకరమైనటువంటి,
జుగుప్సాకరమైనటువంటి. ఘోరమైనటువంటి
సిజాలు. నేను వాడిన సాంప్రదాయిక ప్రతీక
లైన పదాలు ఆ భావాలు కలిగించే చిహ్నాలు.
ఆ పదాలు చదివిన ప్రతి తెలుగువాడిలోనూ
నేను చిత్రించ దలుచుకున్నటువంటి చిత్రం
సూటిగా హత్తుకుంటుంది అన్న నమ్మకంతో
వాటిని నా కవితల్లో వాడుకున్నాను."

నేను చెప్పిన సమాధానం సరియైనది కాదు అంటే నేనేమీ చెయ్యలేను. ఆ ప్రతీకలు వాడకూడదు అంటే ముందు ముందు ప్రయత్నం చేస్తానని హామీ ఇయ్యగలను.

ఈ దేశం బాగుపడటానికి నేడువున్న ఈవ్యవస్థ మొత్తం మారాలి. దీన్ని అన్నివైపుల్నుంచీ యువతరం ఎదుర్కోవాలి. ఈ వ్యవస్థలోవున్న భండాలాన్నంతటినీ పూర్తిగా నాశనం చెయ్యాలి. అందుకు యువతరాన్ని సిద్ధం కమ్మనమనీ, నేడు జరుగుతున్న సర్వతోముఖ పోరాటంలో పాల్గొనమనీ ఆహ్వానిస్తున్నాను.

భైరవయ్య

అగ్నిప్రవేశం

నిలుచున్నాను
అబద్ధాల కత్తి అంచుల మీద నిజంలా
మిన్నంటుతున్న జ్వాలల కొసలపై పొగలా

చూస్తున్నాను
రుద్రిఫాలం మీది నేత్రంలా
చిక్కటి ఇరుల ఉడుపుల వెనుకదాగిన
తొగరు అందాల తేజంలా

ఎదురుగా
నాతలపులోమండిన ఆవేశం అగ్నిరేఖల్లో
కాయంనిండా నిండిన ఉద్రేకం గాయంలో
మానసంలో మత్తెక్కిన ఊహల సురాపానంలో
తన్వులో పర్వెత్తే ఉత్సాహం సైంధవాల రావాల్లో
కనిపించింది
కాలభైరవుని సన్నిధిలో కంకాళనృత్యం
మరుభూమిలో కాలిపోతున్న సగటు మనిషిజీవితం
పుష్పకాల పయనించే పూబోడుల కుసుమ పరాగం
తమతో కలవమనే ముందుతరాల ఆహ్వానం
తనకెదురీదమనే కాలవాహినిసవాలు

ఉద్విగ్నున్నయ్యాను
ఉత్తేజాన్ని ఊపుచేసుకుని
నిబ్బరాన్ని గుండెలో పోసుకుని

కలంమీద కాలాన్ని దూసుకుంటూ
భావాలతో కవిత్వంలోకి చొచ్చుకుంటూ
చుట్టూ భయంకర సత్యాలు సృష్టిస్తూ
కన్‌చెదురుగా—దిల్‌బెదురుగా
వచ్చాను.

నిప్పులానగ్నంగా వికసిస్తూవచ్చాను
గుండెలోమండిన ఆశలావచ్చాను
కడలిలోపెల్లుబికిన బడబానంలావచ్చాను
నింగిలోఎగసిన వేగుచుక్కలావచ్చాను
నిశీధిమంటల్లో
మిన్నంటుతున్న భావాలజ్వాలల్లో
మస్తిష్కం విహరిస్తుండగావచ్చాను
విశ్వంభరంవాకిట్లో చల్లనిచీకటికళ్ళాపిమీద
యామినిఅందంగాచిద్దిన నక్షత్రాలముగ్గుమీద
నానేత్రాలు ఘూర్ణిల్లగావచ్చాను
అక్షరాలతో
ఆశలా—ఆవేశంలా
పెరుగుతూవచ్చాను
నిశ్శబ్దంలో ఆదిమానవుడువిన్న
ఆదిశబ్దంలా వచ్చాను
మాతృగర్భంలో మాటలు నేర్చుకున్న శిశువు పెట్టిన
తొలి పొలికేకలా వచ్చాను
ఆకొన్న బెబ్బులి బొబ్బలా
మేఘాల వికటాట్టహాసాలు చీల్చుకుని
ముందుకురికిన మెరుపులా

—రెండు—

జడివానలా
పెనుగాలిలా
మధ్యాహ్నం మింటనిండిన మార్తాండునిలా
సంధ్యరేపిన నెత్తుటిమంటలా
కన్‌చెదురుగా - దిల్‌ బెదురుగా
కవిలేఖినిలో కదంతొక్కుతూ వచ్చాను
కవిత్వంలోకి చొచ్చుకుంటూ వచ్చాను

—మూడు—

దిగంబరి

పైకున
ఎక్కడో ఒక ఎండుపుల్ల విరిగింది
ఒక పాచినోట్లో వెర్రినవ్వు దూకింది
ఏ గుండెల్లోనో కార్చిచ్చు మొలిచింది

భళ్ళున
ఏ పెదవులపైనో చిర్నగవు విరిసింది
ఏ కన్నుల్లోనో కాంతిరేఖ మెరిసింది
ఎక్కడో కొత్తపువ్వు పూసింది

ఆయ్
ఎక్కడిదా వెకిలినవ్వు
ఎవ్వడిదా పిచ్చిగొంతు

కాదు కాదు కాదు కాదు కాదు !!!!

దిగంబరి
పరిబంధ సుందరికాదు
పారిస్‌లో నగ్నరూప విన్యాసంచూపే కామాక్షికాదు
కాదు బెల్లీ డాన్సర్
అమెరికా నైట్‌క్లబ్ స్ట్రిప్పర్
దిగంబరత్వం
బట్టవిప్పి బారచాచి
నడిరోడ్లో గంతులేయమంకాదు

—నాలుగు—

పదాలతో వలువల్ని ఒలిచేయడం
అంతకన్నా కాము

ఏమిటి ఏమిటి ఏమిటి ఏమిటి చెయ్యడం????

మనిషిలో అట్టడుగున బురదగుంట్లో
పడివున్న మనిషిని లేవదియ్యడం
ఎముకల లోతుల్లో ధ్వనించే
స్వచ్ఛమైన గీతాల్ని ప్రతిధ్వనించడం
కళ్ళవెనుక దాగివున్న
సిసలైన కన్నీళ్లని ప్రసరించడం
గుండెల తీరాల్ని కొట్టుకునే
సహజమైన భావాల్ని ఒడుపుగా పట్టడం
పెదాలకొసల్లో
చిక్కటి చిరునవ్వుల్ని మొలిపించడం
నిజాన్ని నిజంగా నగ్నంగా చెప్పడం

ఇందులో
మానినీ వక్షోజాలు
నగల్లాంటి నగాలు ప్రస్ఫుటించవు
ముద్దులు ప్రవహించవు
మీ పాశవిక పరివృత్తులకి ఫలహారం పెట్టవు
పళ్ళూడిన మృదుసళ్ళనోట్లో
లాలాజలం ఊరించవు
మీలో విలాసాలు-విభ్రమాలు-విహ్వలాలు
పుట్టించవు

దిగంబర కవిత్వంలో అక్షరాలు

కామంతో పుచ్చిపోయిన
లతాంగి పయోధరాలపై
నూతన నఖ క్షతాలుకావు
ఆకాశంలో నక్షత్రాలూకావు- తోకచుక్కలూకావు
సాహితికి-సరస్వతికి
కొత్తబంగారపు తొడుగులంతకన్నాకావు
పచ్చల హారాలు - ముత్యాల సరులు, నవరత్నాలు
అసలు కానేకావు

ఇవి నిజాలు
నిత్యం మండేయదార్థాలు
ఆడదాని ప్రసూతి వేదనలా
జీన్వాల్జీన్ ఆకలిమంటలా
ఎదిగి చేతికందిన కొడుకు
యముడి పరమైతే
తల్లడిల్లే విధవతల్లి గర్భశోకంలా
సూటిగా నగ్నంగా చెప్పబడే సత్యాలు

ఇవి అర్థంగావు
అహంకారులకీ-అహంభావితులకీ
పదాల గారడీలో
పరమార్థంచూసే పక్షులకి
ప్రబంధాల-పురాణాల
అసలు తత్వం విడిచిపెట్టి
చూర్లుపట్టుకు వేళ్ళాడే చుంచులకి
తమలో-ప్రపంచంలో
కొత్తదనం - చైతన్యం

—ఆరు—

కోరని-హర్షించని-సహించని కొజ్జాలకి
తామే యుగకర్తలమని
తమదే సాహిత్యమని
తప్పెట్లు కొట్టుకునే త్రాష్ఠులకి

ఇవి అర్థం గావాలంటే
ఈ సాహితీనగ్న విరాట్స్వరూపానికి తట్టుకోవాలంటే
మీ గుండెలు కుతకుత ఉడుకెత్తాలి
ఉడుకెత్తిన గుండెల్లో కొత్తరక్తం పుట్టాలి
పుట్టిన రక్తం మీ నరాల ప్రాలువల్లో
సుళ్ళుతిరిగి నాట్యంచేయాలి
మీ మస్తిష్కంలో నిర్మించుకున్న
అష్టగోడలు పగులగొట్టాలి
అంటువ్యాధిలాంటి
అజగరంలాంటి
గొంగళీపురుగు భావాలు భస్మంచేయాలి
నిర్మలమైన భావపీచికల్ని
హాయిగా పరిసరింపజెయ్యాలి

మీరు
మొహమాటంతో కట్టుకున్న బట్టలిప్పి
ఒంటరిగానైనా నగ్నంగా నిలబడి
మీలోకి చూసుకోవాలి
ఎరువు తెచ్చుకున్న మెదడుతో మటుకు చూడకండి
చూపకండి పుచ్చిపోయిన కళ్ళతో

అయిందా

— పేడు —

ఏం చెయ్యాలో అర్థమైందా

అయితే చూడండి
కణ కణలాడుతున్న నిప్పుల్ని
మీ అబద్ధాన్ని
మీదనుకున్నదాన్ని
నక్కలాంటి-తుక్కలాంటి-పంది కొక్కులాంటి బ్రతుకుని
సూర్యుని నిజకిరణాలు తట్టుకోలేని గుడ్లగూబల్ని
పొంచున్న మానుపిల్లుల్ని
దొంగచాటుగా మీదపడే తోడేళ్ళని
మీ జీవితంలా పగిలిపోయిన చిళ్ళపెంకుల్ని
మీచుట్టూ విశ్వరూపందాల్చిన సత్యాన్ని.

—ఎనిమిది—

ఎముకల కేకలు

మనిషీ
మానవతా నిగమాగమ ఋషీ

మేలుకో
ఆకాశంలో నక్షత్రాలు నెత్తురు కక్కకముందే
అవనిలో అబద్ధం
విశృంఖల విశ్వరూపం చూపించకముందే
విషనాల్కలు చాచకముందే

తొలగించుకో
హిరోషిమాకి వలె వాటువేసిన అణురజంలా
నీమనసుని కప్పేసిన కృత్రిమత్వపు ముసుగుల్ని
నీవు తొడుక్కున్న ఎరువు చొక్కాని
మొహమాటపు చాకలాడిదగ్గర తెచ్చినదాన్ని

ఛేదించుకో
సముద్రపు నురుగులా
నిన్ను చుట్టుముట్టిన సందేహాల శాక్తేయుల్ని
పేడ పురుగుల్లా
నిన్ను దొలుస్తున్న అనుమానాల హంతకుల్ని

అప్పుడుచూడు
నీ కనురెప్పలలో మొలిచిన

—తొమ్మిది—

(నటనకు అసలుపేరు మోసం)
కొయ్యకండల్ని కోసేసుకునిచూడు
ఈ విశ్వాయమయ ప్రపంచంలో
ఆచిన నువ్వు పొలికేక పెట్టిననాడు
నువ్వు ధరించిన అసలుదుస్తుల్ని తొడుక్కునిచూడు
అప్పుడు వినిపిస్తుంది కనిపిస్తుంది

మనిషీ
మానసిక శిఖరాగ్రాలపై
మానవత్వాన్ని ప్రతిష్ఠించే మహర్షి

డిప్లొమసీ మసిలో ఉక్కిరి బిక్కిరై
గుండెల్లోమండే నిజాన్ని వెళ్ళగక్కలేక
అణువుల్లో ప్రతిధ్వనించే
యదార్థాల పల్లవికి తాళంవేయలేక
నరనరాల్లోసాగే సత్యాన్వేషణకి రాగంతీయలేక
నీ ఎముకల
పొలికేకలు - పెనుకేకలు
చావు బాకాలు

ఆచారాల మౌఢ్యపు నెంటువాసనలు తట్టుకోలేక
భటాచోరు సంఘంలో
బడాబాబులా విన్ను మోయలేక
ఘూకాల బాకాలు
నీ ఎముకల ప్రళయ గర్జనలు

సహజత్వానికి సజీవ సమాధిగట్టి

—పది—

నిజాన్ని విటార్రితిమీద శిలువవేసి
వికటంగా లాస్యంచేస్తూ
వికృతంగా గాంధర్వాన్ని చిత్రవధచేస్తూ
నీచట్టూ మూర్తీభవించిన కృత్రిమత్వాన్ని
గర్హించే నీ ఎముకల హాహాకారాలు

మొహమాటాన్ని నీచట్టూ ఉచ్చుపన్ని
బాధ్యతారహితత్వాన్ని జాంపండు ముక్కలా ఎరవేసి
ండా భయాన్ని ఒంపేసిన
నీ చపటతనానికి - ససవతనానికి
ఖేదిస్తూ
నీ ఎముకల వికృత - ప్రస్ఫుట రోదనధ్వనులు

ఇంకా ఆలస్యందేనికి మనిషీ
నవ్యర్షీ
వినిపించటంలేదా
ఓ మనీషీ - మహర్షీ
నీలో పడగవిప్పని నిజాలబుస
సహజ నైంధవాలహేష

ఆలోచించు
అత్తరారెట్టిన మర్యాదపంచెల్ని కట్టుకోకు
నీ ఎముకల్లో జీర్ణించుకున్న నిజాన్ని బురదలో కప్పెయ్యకు
పొద్దుతిరుగుడు పువ్వులా
లోకంచుట్టూ పరుగెత్తకు
మనీషివై

—పదకొండు—

కాకుంటే కనీసం మనిషివై
ఎర్రగులాబీలా - నిష్పులా
యౌవ్వనంలా - మందహాసంలా
నిజంలా - నింగిమధ్య మార్తాండునిలా
అరక్షణం బ్రతుకు

ఆ అరక్షణం
"నీ" హోరులా హోరెత్తు
నీ ఎముకల ప్రళయార్ణవాన్ని ఎలుగెత్తు

హుర్రే-హుర్రే

ధినక ధినక తద్ధినక ధినక
ధినక ధినక తద్ధినక ధినక
అశ్వరభ శరభ అశ్వరభ శరభ

ఓరి నాయన
ఓరోరినాయన
జాతర - అమ్మోరి జాతర
పెద్దమ్మోరి జాతర
ఊరవతల వల్లకాడు మోతర
ఊళ్ళో అసిపంజరాల గోలర
ధి ధి

పరుగెత్తు - లగెత్తు
వెర్రెత్తి - వేపమండలు మొలకుచుట్టి
నిమ్మపళ్లు చేతబట్టి
కల్లుముంత ఎత్తిబట్టి
గటగటా గుటకవేసి
గణాచారి వీరబాబు
పరుగెత్తు - లగెత్తు

ఊరవతల జొవ్విచెట్టు
భల్లూకాలకి - పెనుభూతాలకి ఆటపట్టు
మదమెక్కిన భటాచోర్లకి

కుళ్ళిపోయిన వామాక్షికి
ఊరిపెద్ద చిట్టిబాబు
భటాచోరు బడాబాబు
పుండాకోర్లకి
బరితెగించిన రండాలకి
కులదైవం పెద్దబాబు
నిర్మించిన వాడకట్టు

ఆడకట్టు
నిజం చెప్పినోడి రక్తంపోసేసి
నిజమన్నోడి శవంపాతేసి
అమ్మోరికి గుడికట్టు

అయ్య బాబోయ్
అమ్మోరు వెలిసింది
వయసొచ్చిన మగోళ్ళని
పురుగుల్లా మింగేసినఎల్లమ్మ
ఒంటినిజిగి వోగ్గేసాక
వైరాగ్యం పుచ్చుకున్న
నాపసాని ఎల్లమ్మ
* దేవతై వెలిసింది

ఊరిపెద్ద చిట్టిబాబు
భటాచోరు బడాబాబు
కల్లో కనిపించింది

—పద్మాలుగు—

* దెయ్యానికి ప్రకృతి దేవత

కల్లాతాగి తందనాలాడింది
కామంతో నోరుతెరిచి
కనిపించినోడినల్లా కరిచింది
ఊరిపెద్దగుండెల్లో గూడుకప్పింది
అమ్మోరు వెలిసింది
మహమ్మారిలా వ్యాపించింది

అదేయ్ బాబు
గణాచారి వీరబాబు
భయపడకు
ఊరిపెద్ద చిట్టిబాబు
భటాచోరు బడాబాబు
బాడఖావు బుచ్చిబాబు
సీ వెన్నుపూసనిండాడు
బలేసిన ఏటపోతు
సగమాడిది–సగంసీది
ఒక్కర్తే మొక్కొచ్చిన
కన్నెపిల్ల మానంలో
సగమాడిది–సగంసీది

అంతెందుకు
సీదేవత నిర్మించినవాడకట్లో
ఊరిపెద్దపాలించే వాడకట్లో
మానంతెలియని నిత్యకన్నెలు
సీపడగ్గదికి వన్నెచిన్నెలు
ఆలసించకు–ఆలోచించకు

—పదిహేను—

పరుగెత్తు - లగెత్తు

నుదుటిమధ్య బొట్టుపెట్టు
గణంపట్టి ఊరినిహాడలగొట్టు
శివంపూని
ఐతికున్నశవాలకి కూడుపెట్టు
నిజాయితీకి విలుచున్నోడి
కూట్లో మట్టికొట్టు

దేవ తెలిసింది
పచ్చి బోగంది
పతివ్రతై మొలిచింది
హూరే ! హూరే !!

—పదహారు—

అహింసని బోధించమంటావా బాపూ

అహింసని బోధించమంటావా బాపూ?
ఎవరికి?

ఆకలి మంటలతో
పేగులు పురిపేనిసధాతాల్లా మెలికలు తిరగతుంటే
"అమ్మా, మాదాకపళం తల్లీ' అని అరవలేక
గొంతువిప్పితే
మెడనరాలు పతేలుమని తెగుతున్న ఉన్నార్తునికా

విలాసాలలో విందుభోజనాలలో
అవసరాన్ని అధిగమించి
కడుపుపట్టక కక్కుకుంటే
అదైనాతిని బతుకుదామనుకున్న ఋదార్తునిపైకి
వేటకుక్కల్ని వుసికొల్పుతున్న నాగరీకునికా!

పాలకోసం పరితపిస్తూ
పసిగందుల నూరేళ్ళు నిండుతుంటే
కొనడానికి పాలపొడిదొరక్క
నిత్యావసరాలకి వస్తువులుదొరక్క
అంగట్లో సరుకులు గగనకుసుమాలై
ధరలు మేడలు మిద్దెలుదాటి
ఆకాశంలో పక్షుల్లా ఎగుర్తుంటే

—పదిహేడు—

రిక్తహోయిమూస్తూ నిబద్ధ సామాన్యసంపాదికా!

కరుపు బిచ్చం పెరిగినపుళ్లా
వెచ్చాలి మూల్యం పదింతలుచేసి
సరుకునిలువు మాడిగల్లో
భూమికో అట్టడుగునదాచి
దానిపై ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్న చీకటి బజారు
వ్యాపారికా

ఈ నాగరికతారణ్యంలో
అయిన వాళ్ళందరినీ వదిలి
కొడిగడుతున్న సంసారాన్నిచూసి
వాళ్ళకోసం
తన జీవితాన్నీ సౌఖ్యాన్నీ వెచ్చించి
గుండెనిండుగా ఆశలతో
మనసునిండా ఆశయాలతో
కళ్ళల్లో యౌవ్వనం విసిరిన చైతన్యంతో
తన వాళ్ళకొక బ్రతుకు చూపిద్దామని
అడుగుపెట్టిన నిస్సహాయని
దారుణంగా రాబందులు పీక్కుతింటుంటే
ఎవ్వరికవి నీపరమధర్మాన్ని బోధించమన్నావు దాహూ!!

జీవితంలో పైమెట్టు అందుకునే సామర్థ్యంలేక
దొరికిన పట్టాముక్క ఆకలినితీర్చే మార్గం చూపలేక
మెట్లెక్కకుండానే ఆఫీసర్ల తలుపులు మూసుకుంటుంటే
వాటిని వెన్నలా కరిగించగలిగేవేది చేతుల్లోలేక

—పద్మనిధి—

తెగించి చదామంటే ఎండ్రిన్ కొనడానికూడా కాసుల్లేక
భయానకంగా
ఉరిపెట్టుకునో, రైలుచక్రాలకిందపడో
పండంటి బ్రతుకుని
ఈలోకపు కర్కశత్వానికి ఫలహారంగా పెడుతున్న
నీ దరిద్ర నారాయణుడికా
లేక
వీటికంతటికీ కర్తలై
పెదాలమీద చిరునవ్వూ, ముఖంనిండా నీస్లోగన్లూ పూసుకుని
నీచుట్టూచేరి, నిన్ను దిష్టిబొమ్మగా నిలబెట్టి
నీనోట అహింసామంత్రం పఠించి
నిన్ను చచ్చిన తర్వాతకూడా ఎక్స్‌ప్లాయిట్‌చేస్తున్న
పొందూరు ఖద్దరు ప్రజాసేవ తత్పరులకా ?

ఎవరికి నీ అహింసని బోధించమన్నావు బాపూ ?
ఏమని బోధించమన్నావు?
ఎవరిని నీపరమోత్కృష్టమైన ధర్మాన్ని ఆచరించమన్నావు

రాబందులు పీక్కుతింటున్న పావురాలనా
విన్ను నమ్మి, నీమాటల్ని నమ్మి
తమ మనుగడని, అస్తిత్వాన్ని
గోముఖ వ్యాఘ్రాలైన నీ అనుయాయుల చేతుల్లో
అతినమ్మకంతో బలిదానంచేస్తున్న ఈ సీఅమాయక ప్రజల్నా?

క్షమించు బాపూ
అంతటి పాతకం నేను చెయ్యలేను

—పతొమ్మిది—

నీ తారకమంత్రాన్ని పఠించలేను
అణచబడుతున్న శక్తుల్ని అణిగివుండమని చెప్పలేను
అణుస్తున్న కర్కశపాదాన్ని ముద్దెట్టుకోమనలేను
నమ్మకున్న సత్యం నట్టేటముంచుతుంటే
ఖర్మవాదాన్ని బోధించలేను
నన్ను క్షమించుబాపూ
నా పర్జిల్ని నిర్వీర్యుల్ని చెయ్యలేను

బాపూ
ఇది అణచినా అణగనిశక్తి
ఇన్ని కోట్లగుండెల్లో ఆవేదన
ఇన్ని కోట్లగుండెల్లో మంటలు
విజృంభిస్తున్నాయి
ఈజాతి పండించుకునే పసిడిపంటలో
అడ్డునిలిచే కలుపుమొక్కల్ని దహించికాని వడలవు
ఇన్నికోట్ల నీదరిదర్శి నారాయణులు
యోగులూకారు భోగులూకారు
చీమూ నెత్తురూవున్న చైతన్యవంతులు
హింసని హింసతోనే పర్తిఘటిస్తారు

బాపూ!
నువ్వేకనక ఇప్పుడుపుడితే
నువ్వూ అదేబోధిస్తావు!

—ఇరవై—

ఖబడ్దార్

అయ్యా! మహాశయా!!
రాజకీయ దురంధరా - ఖబడ్దార్

మీ రాజకీయాల రంకుసీతికీ
మీ కుహనా విధానాల వాదాలకీచులాటక్రీ
మీ కీర్తికామర దురదలకీ
మీ పదవీకాముక హస్తప్రైధునాలకీ
మీ చుట్టూవున్న రొచ్చులకీ
మీరుపెంచే పందులకీ
మీకందరికీ హెచ్చరిక

మీ వాదాలువద్దు
మీ రాజకీయాలువద్దు
మీరు వదిలేసిన కశ్మలంతింటూ బతుకుతున్న పందులువద్దు
మీరువద్దు

మాకు కావలసింది
కూడూ గుడ్డా నీడా
మాకు కావలసింది
మాజీవితాలు మేంబతికే స్వాతంత్ర్యం
మాకు కావలసింది
మా ఆలోచనల్లో

—ఇరవై ఒకటి—

మీ బొజ్జల, బొర్రిముక్కుల
పుచ్చిపోయిన మీ కుష్ఠుబుర్రిల
ప్రమేయం లేకపోవడం

మమ్మల్ని రెచ్చగొట్టకండి
దుర్భర, దుస్సహవేదనలో
వకనకలాడే పేగుల్తో
చావని మానవత్వంతో
రగులుతున్న అగ్నిపర్వతాలం
ఖబడ్దార్!

—ఇరవై రెండు—

తిరుగులేని నిజం

ఇది నిజం
ఈ నిర్వచనం నిజం
ఇందులో ప్రతిఅక్షరం
అణగారిన అన్నార్తుని నెత్తుటి మంటన్నది నిజం
"అణుస్తున్నఅబద్ధంకింద ఎరుపునిజం ఆరకుండారగుల్తుంది"
అన్న కవివాక్యం
పేదవాని పేగులతో
తమ పిశాచనృత్యాలకి
క్రొత్తలు సవరిస్తున్న వేళ్ళని ఖండిస్తుందన్న
యదార్థం నిజం

ఉప్పొంగుతున్న కన్నీటి అలలవెనుక బడబాగ్నిని
పుక్కిట పట్టచూసే పుండాకోర్లు
అంగుట్లో అణుబాంబులు బ్రిద్దలవుతాయన్నది నిజం

మగత విడిచిన మానవమేధల్లో
జూలు దులిపిన కవిసింహం
ఇక ఉపేక్షించదని
గళంవిప్పి గర్జనలుచేస్తూ
వెన్నుతడుతూ వెన్నుపొడిచే
వెధవాయిల నాలుకల్ని
గంద్రగొడ్డళ్ళతో ముక్కలుచేస్తూ -

—ఇరవైమూడు—

అడ్డునిలిచిన
గంజాయి మొక్కల్లాంటి అవకాశవాదుల్ని
కూకటి వేళ్ళతో దహనంచేస్తూ—
రేపు
తూర్పుదిక్కుని బ్రద్దలుచేసి మింటపొడిచే మార్తాండునికి
నేడు
ఆహ్వానంగా బ్రెస్‌గన్లు పేలుస్తున్నదన్నది
తిరుగులేని నిజం

—ఇరవైనాలుగు—

చెరచబడ్డగీతాన్ని

నేను చెరచబడ్డ గీతాన్ని
నగ్నంగా నడిపీధిలో కాటేసినభూతాన్ని
స్వార్థపు కాంక్షీలు తొడలమధ్య
నలిపివేయబడ్డ రాగాన్ని
కీర్తిరతితీరని బాబాకరుల
భయంకర

పక్షతాలకి దంతక్షతాలకి
పుళ్ళుపడి కుళ్ళిపోయిన వక్షాన్ని
నేను గీతాన్ని

కేరింతలుకొట్టి
పరులకైత తమదనిభేరీ మ్రోగించి
చలామణీ చేయించే
చాపల్యాల చవకబారు కామోద్రేకానికి
చచ్చి పుచ్చిపోయిన పిండాన్ని

ముద్రాక్షితలతో తమ రాక్షసత్వాన్ని
లిఖించుకోవాలని
తాపత్రయపడే తుచ్ఛులు
నైరవిహారంచేసిన శరీరాన్ని

—ఇరవై ఐదు—

రసాన్ని వదిలి
రాక్షసత్వాన్ని ప్రతిబింబించిన రూపాన్ని
నేను గీతాన్ని
అసహ్యంగా అసభ్యంగా
బహిరంగంగా బాహాటంగా
సిగ్గులేక - చాకచక్యంలేక
నీచంగా - ఛండాలంగా
చెరచబడ్డ గీతాన్ని
చిత్రించబడ్డ భూతాన్ని

అణుయజ్ఞం

కొడిగట్టిన చుట్టనుసిలా
ముసుగేసుకున్న విధవలా
అలుముకుంది వెన్నెల

భేతాళుడిలా చంద్రుడు
వికృతంగా నవ్వుతున్నాడు
మారీగణాల్లా నక్షత్రాలు
హాహాకారాలు చేస్తున్నాయి
రాజుకుంటున్న నిప్పులా
నిలబడింది రాత్రి - అర్ధరాత్రి

పీర్లసాయిబులా నడుస్తున్నాన్నేను
నిప్పు కణాలమీద
సమిధల్లా మండుతున్న క్షణాలమీద
అగ్నికీలలా వ్యాపిస్తోంది
నా పెదాలమీద చిరునవ్వు
పిడుగుల్లా వేస్తున్నాను అడుగులు
కంకాళాలు కైవారాలు పలుకుతున్నాయి

ఆకాశంలో గ్రహాలను దిగ్గొట్టి
నక్షత్రాలను వేళ్ళాడదీస్తున్నాను

—ఇరవైవీడు—

పాతాళానికి గోతులుతవ్వి
శబ్దాలని పాతిపెట్టి
అర్థాలని అణగద్రొక్కి
తాత్పర్యాలని పూడుస్తున్నాను
సౌందర్యాన్ని మంటబెట్టి
ఆనందాన్ని ఆహుతిచేసి
విషాదాన్ని సృష్టిస్తున్నాను
శూన్యానికి ఆకృతినిచ్చి
పర్ణవంలో ప్రళయాన్ని పలికిస్తున్నాను
లలాటం తెరచి
పాశుపతాలు సంధిస్తున్నాను
అర్థంలేని
సహితత్వ రహితత్వాలతో
పనిలేని
భావాలమీద
ఆకాశం మంటపంకింద
ఒంటికాలి నృత్యంచేస్తున్న
అణ్వస్త్రాల ఆధునికుణ్ణి

నేను

మారణాయుధాల మానవుణ్ణి
నేను యజ్ఞం తలపెట్టాను
పర్ణపంచంమీద నిర్మించిన హోమగుండంలో
చరాచరాలు హవిర్భాగాలు
భేతాళుని ఋత్విజుతత్వంలో

—ఇరవై ఎనిమిది—

ఘృతంగామారిన కొలాన్ని
ఆస్వాదించిన యాగపురుషుడు స్మశానం
భైరవుని పర్యవేక్షణలో
వేదపండితులు — భూతాలు
పిశాచాలు మోగించాయి మంగళతూర్యాలు
చిక్కులు రుధిరం కక్కుకున్నాయి
గగనపాలంమీది కనురెప్పలు విచ్చుకున్నాయి
ధాత్రీదేహంలో అగ్నిపుటలు బద్దలయ్యాయి
జిలతరంగాలు వికృతంగా చిచ్చుపెట్టాయి
వాయుదేవుడు విషాస్వాదనతో
మత్తెక్కి తూలుతున్నాడు
హోమజ్వాలలు తాండవం చేస్తున్నాయి
రుధిరసోమాన్ని సేవించిన ఋత్విక్కులు
సౌద్రంతో స్వాహామంత్రాలు
ఉచ్ఛాటన చేస్తున్నారు
యాగాశ్వంలా నిలిచినసృష్టి
హేషా (ఆక్రా) రావాలు చేస్తోంది

ఒక్కసారిగా
అణుగుండంలో
యాగపురుషుని ప్రత్యక్షంతో
సర్వస్తంభన జరిగింది
నా దోసిట
యాగఫలం
పిడికెడు భస్మం నిలిచింది

— ఇరవై తొమ్మిది —

స్మశానంలో సూర్యుడు

ఆది నిశాకరుడు ఒంటరిగా జోగుతున్న – త్రి
నిద్రాదేవి నాకు విడాకులిచ్చిన శర్వరి

ఒక్కణ్ణో
దిక్కుల ఉక్కుగోడలమధ్య
వసుమతి నిమ్మోన్నశాలమీద
ఇటూ అటూ దొర్లుతున్నాను
పైన నాకు తోడుగా ఒకచుక్క
ఎందుకో భయపడుతోంది
దూరంగా
పంచాయతీ చమురుదీపం
క్షణాల్ని పురుగుల్లా మింగుతోంది
అల్లంతదూరంలో
వల్లకాడు వగ్గులా ఒణుకుతూ
చలి కాచుకుంటున్నాడు
నన్నుకూడావచ్చి కూర్చోమన్నాడు
ఇద్దరిమధ్య కొంతసేపు నిశ్శబ్దపు వికాసం

బాబూ!
ఏమిటో నీతో చెప్పుకోవాలనిపిస్తోంది
(ముసిలాడి గొంతులో కంపన)

— ముప్పై —

ఎందుకో అర్థంకాదు
ఆలోచనల కంతుచిక్కదు
అందరికీ నేనంటే భయం
దాన్నే అసహ్యమంటారుట
అందరూ నా వయస్సుగురించి అడుగుతారు
పరమాణువుతో ప్రాభవం పొందిన నాకు
వయస్సెంతో గుర్తులేదు
అప్పట్నుంచి ఇప్పటివరకూ
శ్రమతప్ప మిగిలిందిలేదు
నా ఈ గుండెలో
ఎన్నిమంటలు రగులుతున్నాయో
ఎన్ని తంత్రీలు తెగిపోతున్నాయో
ఎన్ని అపశ్రుతులు పలుకుతున్నాయో
నీకర్థంకాదు
ఎన్ని గాధలు, ఎన్ని దృశ్యాలు
భీభత్సరస పరిధానమైనవి
కరుణాశ్రితమైనవి
శృంగార పరిధానమైనవి
నీచమైనవి
ఉత్కృష్టమైనవి
ఎన్నిటికి నే ప్రేక్షకుణ్ణయ్యానో
ఎన్నిటికి నే శ్రోతనయ్యానో
ఎందరు అభాగ్యులు
నా నీడలో తలదాచుకున్నారో

—ముప్పైఒకటి—

ఎందరు ని శ్రీతులకో
వెలివేయబడ్డ వాళ్ళకి
ఆశ్రయమిచ్చానో
ఎందర్ని మీవాళ్ళు బహిష్కరిస్తే
ఎందర్ని మీవాళ్ళు తృణీకరిస్తే
తరిమేస్తే, విసిరేస్తే
అందర్నీ నాకడుపులో దాచుకున్నాను
అనంతమైన నా సామ్రాజ్యంలో
చలించని నా పాదాసాదంలో
చోటు లేకపోవడమంటూ వుండదు
నా ఆస్థానం పుష్పకం
విశ్రాంతి దొరకకపోవడమనేదే లేదు
సుషుప్తి నా ఆస్థానగణిక
నాకు చలనంలేదు
జన్మరాహిత్యమనేదే వుండదు
అసలు జన్మమే లేదు

మీ లోకంలో
మీరు నమ్ముకున్న కాళ్ళకిందిభూమే దొలుచుకుపోతుంది
నా లోకంలో విదోగ్రహాలకి తావులేదు
అక్రమాలకీ దౌర్జన్యాలకీ అవకాశమేలేదు
సౌహార్దం నా రాజ్యంలోనేవుంది
సమభావం నా పాలనలోనే కనిపిస్తుంది
అయినా
అందరూ

—ముప్పైరెండు—

నా లోకం నివాసయోగ్యం కాదంటారు
మళ్ళీ మీలోకే వస్తామంటారు
మిమ్మల్నే నమ్ముకున్నామంటారు
ఇందరి కాళ్ళీయమిచ్చాను
ఇంతమంది భారం నాదని భావించాను
వీళ్ళంతా నా వాళ్ళనుకున్నాను
కానీ
చివరికి నేనొక్కణ్ణే మిగులుతాను ఎప్పుడూ
ఇందరు నా నీడలో తలదాచుకుంటున్నా
ఎవ్వరికీ నాగోడు పట్టదు
అందరూ
మీచుట్టూ చేరతారు
ఏవో ఆశలతో
ఆర్థంలేని ఏవేవో కోర్కెల రెక్కలతో
మిమ్మల్ని ఆకర్షియిస్తారు
తరిమి తరిమికొట్టినా
తిరిగి మీదిక్కే వస్తామంటారు
నా రాజ్యంలో చైతన్యం లేదంటారు
కొత్తదనం కనపడదంటారు
నాది నిరంకుశత్వమని దూషిస్తారు
నన్ను వికృతంగా మీకు చూపెడతారు
అందుకే మీజాతిని నమ్మరాదు

కానీ ఒక్క విషయం
మీరెంత విశ్వాసఘాతకులైనా

— ముప్పైమూడు —

అవకాశ వాదులైనా
నా గుండెలలో మంటలు రేకెత్తించినా
నా మనస్సుని మసిచేసినా
నాకు లెక్కలేదు
నా కర్తవ్య నిర్వహణలో వెనుకంజ వుండదు
నా ఆశయాలకి భంగం కలుగదు
నా ఆదర్శంనుండి విముఖత్వముండదు
నా హృదయం విశాలమైంది
నా ఔదార్యం అనంతమైంది
నా పార్శ్వాదానికి తలుపుల్లేవు
లోపలికి రావటానికి ఆంక్షల్లేవు
గూర్ఖాలేదు, గుర్ర్రమనే తుక్కల్లేవు
పాస్‌పోర్టుల అవసరంలేదు
కష్టమ్స్ అధికారి ఎవడూలేడు
ఎప్పుడూ స్వాగతగీతాలు పలుకుతునే వుంటాను
వస్తానుబాబూ అంటూ లేచిపోయాడు
కన్నీళ్ళు తుడుచుకుంటూ మునిలాడు

పైన చుక్క నన్ను జాలిగాచూసింది
మాగన్నుగా తల పంకించాడు తారాపతి

అయినా
ఈ నిరంతర సంఘర్షణలో
అనంతమైన చైతన్యాన్వేషణ ఏదో నన్ను నడిపిస్తున్నది
ఈ మునిలాని కన్నీళ్ళనుమించి

—ముప్పైనాలుగు—

జారిపడ్డ ఈ చుక్కనుమించి
తలపంకించిన ఈ తారాపతినిమించి
ఈ చీకట్లనుచీల్చే ఆగామి సూర్యుడిపట్ల
ఈ స్మశానంలో మొలకెత్తే జీవచైతన్యంపట్ల
నాకు నమ్మకముంది

—ముందుకు—

షష్టిపూర్తి

దేశంలో క్షేమంలో
బడా బడా నాయకునికి
బహుత్ బడా ఆసామికి
షష్టిపూర్తి

ఒక్కసారి
దిక్కులన్ని ఒక్కసారి
నగరంలో
నాల్గువైపు పల్లెల్లో
రోడ్లన్ని ఒక్కసారి
ఫెడేల్ ఫెడేల్ బ్రిద్దలయితే
ఫెళఫెళమని పందిళ్ళు ఎదిగిపోతే
అచ్చట్లు ముచ్చట్లు
ఆపైన
చప్పట్లు తప్పట్లు తందనాలు
నడిరోడ్లో సంబరాలు
ఒక్కమ్మడి మూకుమ్మడి
ముమ్మరంగా వచ్చిపడితే
చావుబాజ పెళ్ళిబాజ
అమ్మోరికి ఏటపోతు నేనేందుకు

— ముప్పైఆరు —

తీసుకెళ్ళెటప్పుడేయుబాజ
మిళాయించి ధనాయించి
ధన ధన మని
దగుల్బాజీ మాటల్లా
వాయి నే వేయి నే
కోయడాన్ను కొంగడాన్ను
కొరివిదెయ్యం దొంగడాన్ను
కొరివిపట్టి దుమ్మురేపి
కర్రిసాము కత్తిసాము
మాటల్తో మనిషిసాము

అరే అరే
షష్టిపూర్తి
అరవదేళ్ళు నిండినట్టి
అపరసంఘ సంస్కర్తకి
షష్టిపూర్తి

నాలుగేళ్ళు సానబట్టి
నిట్టనిలువు తవ్వించిన
నీరులేని మోటబావి
(అక్కడుండే యీరిగాడి పూరిగుడిసె
నేలమట్ట మయిందంటే వేరేసంగతి)

ఊరవతల పడమటేపు
ప్రజానీక పారిశుద్ధ్యానికి
కట్టించిన బహిర్భూమి

—ముప్పైవీడు—

(పిచ్చి పంతులు పైటపొలం మొత్తుకున్నా
ఢిక్కాలేడంటే వేరేసంగతి)

మూడో వార్డు రోడ్లన్ని
ఇరుగ్గున్న సందుల్ని
వెడల్పుచేసి వెల్లడించిన ప్రతాపం
(ఎగస్పార్టీ కోటిచ్చిన కోటయ్యలాంటోళ్ళు
నోట్లో మట్టికొట్టిందంటే వేరేసంగతి)

సానివాడ చదలపుట్ట
కందిరీగ తేనెతుట్ట
చెదరగొట్టి
గడప గడప చెదలంబట్టి
కందిరీగ కొంపలన్ని కొల్లగొట్టి
వాడవాడ సానులొచ్చి
ఊరువాడ ఏకమైతే
చెలామణీ చక్కాలింత
అపరసంఘ సంస్కర్తకి
షష్టిపూర్తి

కవితలన్ని కాపీకొట్టి
పరుల పద్దెం పదునుబెట్టి
పరకాయ ప్రవేశం చేసినట్టి
కైంకర్యపు కవిపుంగవునికి
షష్టిపూర్తి

మతంలోన మతులుదప్పి

— ముప్పైఒకటి మిది —

సోమపానం ధూమపానం
షోడాబుడ్డి సారాబుడ్డి
షోడశోప చారాలతో
నెంట్లు పూలవాసనల్తో
ముదితల మర్మాంగాల
వేదాంతపు వేదికెక్కి
ఉపన్యాసం హసన్యాసం
ఏకబిగిన దంచినట్టి
అపర సన్నాసికి
షష్టిపూర్తి

కళామతల్లి కారుణ్యాల కల్పవల్లి
కవోష్ణాలని వడ్డీకిచ్చి
బహువిధ అగాధమీల పీటలెక్కి
కళానేవ బురదజల్లు
కళ + అకారుడికి
షష్టిపూర్తి

ఇలా ఇలా
ఎందరికో
మహానుభావులెందరికో
షష్టిపూర్తి
మా ఊళ్ళో
వెకిలిసవ్వు వెకిలిచేష్ట
అంతా వెకిలి వెకిలి

—ముప్పై తొమ్మిది—

వెదురుగొట్టం వెంగళప్ప వాజమ్మకికూడా
షష్టిపూర్తి
దానికి మా ఊళ్ళోవున్న పందులు కుక్కలు
అఖరికి గాడిదలుకూడా
మేళ తాళాలతో పూలహారాలతో
హాజరు!!!

—నల్లై—

ఆగ్నిశిఖలు

నా అక్షరాలు
నెత్తుటి కన్నటిబొట్లు
కోమలి పెదాలపై కొరిన్నెత్తురు చిందించిన గాట్లు
అర్ధరాత్రి రగులుతున్న చితిలో
ఆవులిస్తున్న అగ్నిశిఖలు
యువనాడుల రక్తంలో
ప్రవహించే ఎర్రికణాలు
మధ్యాహ్నపు మంటల్లో
సవ్వాతున్న మంకెనపూలు

నా కైత
పేర్చితాసనంపై మహంకాళి సేవించే రక్తధార
దిగసంధిలో సంధ్యాదేవి కక్కుతున్న నెత్తుటిచార
తాగబోతు కళ్ళల్లో తొంగిచూసేఎర్రిజీర
తడకుని నాల్కలపై నర్తించే విషజ్వాల
చండీయుని నేత్రంలో ఉబుకుతున్న ప్రళయజ్వాల

అందుకే
నా కైతలో చితులుపేరుస్తున్న అక్షరాలు
నా గుండెల్లో ఒదిగివున్న
బడబాగ్నుల సందిట్లో

—నలభై ఒకటి—

పగిళయాగ్నుల కౌగిట్లో
నలిగిపోయి
నా వాగ్రితల్లో అరిగిపోయి
మాటల్లో పగిజ్వరిల్లి
మీ మార్గంలో బరిసెల్లా దిగబడి
ఐల్లెపు ములుకుల్లా నిలబడి
భుజంగాల జిహ్వాల్లా ఎగబడి
మీ చుట్టూ
పెనుమంటలు రేకెత్తిస్తాయి
కార్చిచ్చులు రగిలిస్తాయి
మీ నవనాడుల
విషరేఖలు పగిసరిస్తాయి
విలయాన్నే సృష్టిస్తాయి

కరువు బిచ్చం

అన్నా భయపడకు
కరువు భత్యం పెరుగుతుంది
కొండచిలువ నోట్లోకి ఈగపిల్ల దూకుతుంది

నీ జీవితంలా చిరిగిపోయిన చొక్కాకి కొత్త మాసికేసుకోవచ్చు
అర్ధాంగి కళ్ళలో అరక్షణం కాంతులు నింపొచ్చు
అప్పులవాడిని ఆమడ దూరంనుంచి
ధైర్యంగా చూడొచ్చు
షావుకారనే నల్లదేముడికి ముడుపుకట్టొచ్చు
ఆఫీసరు చిన్నకొడుక్కి బిస్కట్లు పట్టుకెళ్ళొచ్చు
లోకంతెలియక ఆకలన్న ఆశీర్వాణ్ణి
సూటిగా కసరొచ్చు
డాక్టరు నీళ్ళలో కొత్తరంగుచూడొచ్చు
కొంతనేపు గుండెమీద చెయ్యేసుకుని
నేనే అనొచ్చు
రోడ్డుమీద జెర్రిపోతులా జారిపోతున్న
ప్లిమత్‌కారుని సరదాగా పరిశీలించొచ్చు
" షోకేసు "లో వస్తువుల్ని ఆతర్పిగా అధికారయుతంగా పరీ
క్షించొచ్చు

(ఫుట్‌పాత్‌మీంచి)

—నలభై మూడు—

అన్నన్నా ఇంకా భయందేనికి
ఈ ఊపులోనిండిన కొత్తనెత్తురుతో గానుగెద్దుని పునరుద్ధరించొచ్చు
అల్లవాళ్ళబ్బాయి కొత్తసైకిలు చూపించి బాబిగాణ్ణి మభ్యపెట్టొచ్చు
అంగట్లోంచి జారిపడిన వూలరేకులు
పదిలంగా ఏరుకుని ఇల్లాలికురులు నింపొచ్చు
ఒక్కసారి ప్రస్తుతాన్నివదిలి భావికేసి ఆకాశంలో నక్షత్రాలకేసి
ఆశకేసి
ఆశగా చూడొచ్చు
రానున్న గ్రీష్మాన్ని విడిచిపెట్టి
ముందున్న చలికాలం మరిచిపోయి
పావుక్షణం కాలరెత్తుకు చూడొచ్చు
ఏమైతేనేం
లోకం ఎల్లావుంటేనేం
పెద్దన్నా
నీ కరువుభత్యం తప్పక పెరుగుతుంది
ధరలవేగం హెచ్చుతుంది
కొండచిలువ మరోసారి ఆవులిస్తుంది.

—నలభైనాలుగు—

ఆకాశం యీసారి నిజంగా బావుంది

ఆకాశం బావుంది
అవునవును
అంగట్లో అందం
చవగ్గా చులాగ్గా దొరుకుతోంది
తాజాసరుకు
తాజా మురబ్బాలావుంది
తమకం తావులేక
తామరలా
పెద్దమ్మోరిలా
ఒళ్ళంతా పాకుతోంది
ఒకటో తారీఖు
జేబులోమొలిచిన పుండ్లని
వేళ్ళు బరబరా బరుకుతున్నాయి
ఒళ్ళంతా రేగుతోంది
కె పెక్కుతోంది
"నేడే నీదిరా — రేపే లేదురా"
కా కా హోటల్లో ఆరిగిపోయిన గ్రామ్‌ఫోన్ ప్లేటు
ఆవురావురుమంటూ మూర్ఛనలు పోతోంది
చివికి చిరిగిపోయిన కోర్కెల చొక్కాకి
మాసికలు వేసుకుని

—సలాఁ ఐదు—

సెంటు పూసుకోవోయ్ లబ్ధావధాన్లూ-
అంటోంది

లోకానికి ఆ చివరనుంచున్న ఆనందం:
ఎండిపోయిన ఆశల చివుళ్ళకి
ఎర్ర రంగువేసి
ఎగిరి గంతెయ్యవోయ్ వెంగళప్పా-
అంటోంది

సంఘంలో తుర్రిళ్ళపడుతున్న ఉద్యోగం:
కాస్సేపయినా
ఇనప గోడలమధ్య బంధించిన
నీ ఊహల తురంగాలని
మాలిష్‌చేసి
లోకంలో అందపు మైదానాలమీద
వదిలెయ్యవోయ్ నిరుత్సాహ వ్యాపారీ-
అంటోంది

నల్లకార్చులా తళతళ మంటున్న సౌందర్యం:
కిసుక్కుమని నవ్వుతూ
తళుక్కుమని చూస్తూ
అడుగులు గతితప్పకుండా
గమనం చూడకుండా
హయాల్లా హుషారుగా
సిసింద్రీల్లా చలాకీగా
పడుతున్నాయి
కెంపుల కాంతులు కురిపిస్తూ

— నలభై ఆరు —

చిరునవ్వు చిందిస్తున్న సౌందర్యం
చిలిపిగావుంది
హుషారుగా రమ్మంటోంది
మార్గం నిష్కంటకంగా కనిపిస్తోంది
కళ్ళుమూసుకున్నా గమ్యంచేరడం సులువనిపిస్తోంది
సులువుగా - లఘువుగా
ఉత్సాహంగా - ఊపుగా
ఉరకలేస్తోంది మనసు
ఉరకమంటోంది సొగసు

ఇంతలో ఏదో కలుక్కుమంది
వివేకం ములుకైంది
మార్గంలో తుమ్మముల్లులా నుంచుంది
ఖస్సుమని దిగింది
బుస్సుమని రక్తం పొంగింది
విరుచుకుపడింది
గజ గజ లాడించింది
"గృహమే కదా స్వర్గసీమ"
అయ్యారు హోటల్లో నేషనల్ ఈకో
ఆపస్వరాలు పలికింది
కాహళిలా ఖంగుమని మోగింది
భేరీలా ప్రతిధ్వనించింది

పదినెలల పసిమనసు
"పాలదబ్బా' అంటూ పాడుగోలపెట్టింది

—సలభై ఏడు—

రెండేళ్ళ లేత పయసు
"సుల్లంచొమ్మ" కోసం గంతులేస్తోంది
ఇంట్లోవున్న సగంమనస్సు
ఆశగా అంబరంచేసి చూస్తూ
ఇంకా ఇల్లుచేరని
సగం మనసుకోసం ఎదురుచూస్తోంది
మనసు నిలిచేందుకు
ఇల్లునిచ్చిన కాయం
నెలసరి కిరాయికి గుమ్మంలో కాచుకునుంది
మనసు కదిలేందుకు
ఆధరువిచ్చిన
కిరాణా కాయం ఆవురావురుమని ఆవులిస్తోంది
ఇంకా, ఇంకా
మనసు చుట్టూచేరి
భజన చేస్తున్న మనసులెన్నో!!

పాపం
మనసుకి విసుగేసింది, ఒళ్ళు మండింది
విదిలించికొట్టి ముందడుగేసింది
కానీ
వివేకానికి సాయమొచ్చిన కర్తవ్యం
ఉరిమురిమి చూసింది
ఉగ్గింగా నిలిచింది
చుట్టూ చూడమంది మనసుని
"నీలోకి చూసుకో" అంది

—నలభై ఎనిమిది—

మనసు ఢీలా అయింది
జాలిగా చూసింది అందాన్ని
అందం చిన్నగా నవ్వింది
సవాలుచేసింది
కన్ను కలిపింది
"అంతలోవుంది అమరత్వం
కళ్ళు మూసుకో - కదిలివచ్చేయ్" అంది

మనసు కదిలింది
మమత లేదంది
కర్తవ్యం కత్తిలా విలవిడితే
వివేకం ఒడిసిపట్టింది
మనసు గింజుకుంది
విలవిలమంది

అందం దరువేస్తూ ఆహ్వానిస్తోంది
కదిలితే కర్తవ్యం ఉస్సు బుస్సుమని పొడుస్తోంది
జేబులో పుండ్లు ఉలారం పెడుతున్నాయి
సౌందర్యం సుతారంగా పిలుస్తోంది
మనసు ఎగిరి అందుకోబోయింది
వివేకం వెనక్కి - ఇంకా వెనక్కి లాక్కుపోయింది

అందం కవ్విస్తోంది
"కంతుడా! ర!" అంటోంది
మనసు ఉరకలేసింది

—వలభై లొమ్మది—

పన్నగంలా ఉధృతంగా సాగింది
వివేకం నాగస్వరం పట్టింది
లాలిపాట పాడింది
కర్తవ్యం ఇస్సుమని అందంమీద దూకింది
సౌందర్యం హడలెత్తి మాయమైంది
మనసు నిదరోయింది
మనస్సు పిలుపువిన్న
మమత లేచింది
ఆకాశం ఈసారి నిజంగా రావుందంది.

—యాభై—

కబళించిన కాలం

రాత్రి
నగరం నరాలమీద నడుస్తున్న నన్ను
లోకం వంకరగా చూస్తోంది
నేనేనే ప్రతీ అడుగూ
కంతలోచేరిన తేలుపిల్లలా పరీక్షిస్తోంది
ఒంటరిగా
నా ఆలోచనల తోడుగా
అర్ధరాత్రి నుదుటిమీద
బొట్టులా మెరుస్తున్న చంద్రుడు సాక్షిగా
పట్నపు గడియారం నాకండగా
నే నడుస్తుంటే
రాత్రి
చాచిన నాలికమీద
నన్ను చప్పరిద్దామని చూస్తోంది
భావిలో ఉజ్వలాన్ని చూస్తూ
గతంలో అనుభవాన్ని జోడిస్తూ
ప్రకృతాన్ని ప్రజ్వలింపచేస్తూ
ఆశలతో ఆశకి జీవనోపాధి చూపిస్తూ
నే సాగుతుంటే
నైరాశ్యపు సందిట్లో నలిపేద్దామని
ధృతరాష్ట్రునిలా యత్నిస్తోంది

—యాభై ఒకటి—

నా సిరధమనుల్లో రక్తం
లావాలా రగులుతుంటే
వైతాళికులకి హెచ్చరికలు రచిస్తూ
నే పూరించిన శంఖంలో మెదిలినరావం
నవయువతకి వినిపించాలని
నే ప్రయత్నిస్తుంటే
కాలం కరచేద్దామని బుసలుకొడుతోంది
నాచుట్టూ పన్నిన పద్మవ్యూహంలో నిలబడి
అభిమన్యుడిలా గర్జించి
నారిసారిస్తూ చేసేపనుష్టంకానికి
అవిసిన గుండెలని పట్టుకుని
పొగడ్తల పాయసం త్రాగించి
కైపెక్కిన సమయంలో కబళించింది
ఆ రాత్రి
కాలం కబళించిందని తెలుసుకున్న రాత్రి
రాపుతున్న కన్నీటికణం అంచుమీద నిలబడి
చుట్టూ చూసుకున్నాను
నాలికచీలిన తక్షకునిలాంటి రాత్రి
చీలికల కొసలను నాచుట్టూతిప్పి
ఒంటికన్నుతో ఆస్వాదిస్తోంది
అందని ఊపిరిలో పెనుగులాడుతుంటే
నన్ను విలబెట్టి
ప్రపంచాన్ని పిలిచి
నాచుట్టూ భీకరంగా నాట్యం చేయించింది
నిరోలా నవ్వుతూ సంగీతం మీటుతోంది

—యాభై రెండు—

యీ జడత్వంలోంచి

ఆనందం ఒక్క-సారివచ్చి
ఈ నిరంత నిట్టూర్పుల
విషాదాంత జీవిత ప్రాంగణాలముందు నిలబడి
పలుకరించి వెళ్ళవూ

ఈ వేదనామయ జీవితాన్ని విలోకించి
ఈ మనసుని తిరోగమనంనుంచి రక్షించి
ఆశల పుప్పొడి చిలికించవూ
ఈ పలాయన వాదాన్ని
కప్పదాట్లని
నిరాశనీ - నిస్పృహనేచూసి
విషాదాన్నీ — నైరాశ్యాన్నీ సృష్టించే మనస్తత్వాన్ని
విధివాదాన్ని అంగీకరించి
పురుషకార్యాన్ని విస్మరించి
అర్ధరాత్రిమీద గీతాలువార్చి
గుక్కెడు సిగరెట్టుపొగలో స్వర్గాన్ని నిర్మించుకునే
నా అల్పమనస్సుని
పీజ్
శస్త్రచికిత్స చెయ్యవూ

పబ్లిక్ రోడ్డుమీద

—యాభైమూడు—

శేషసాయిలా పవ్వళించిన కుష్టురోగిని చీదరించుకుని
వేదికలెక్కి
ఘనానా కబుర్లుచెప్పి
నా అహానికి ఐంగారు తొడుగుకప్పి
స్వయంగా ఆచరించని సిద్ధాంతాలని
పదిలంగా పరుల కందజేసి
పెదాలమీద చిరునవ్వులు మొలిపించి
కనపడ్డ ప్రతిజీవికీ
కమ్మగా కుత్తుకల కురిబిగించి

వద్దు - వద్దు
ఈ నటనల్ని - ఈ ముసుగుల్ని
చీల్చి
ఒకింత నిజాయితీని నాలో నిల్పవూ
విచక్షణ
ఆవేశాన్ని - ఉద్రేకాన్ని అధిగమించి
వివేకం - ఉత్సాహాన్ని పుంజుకుని

చూడు ఆనందం!
ఈ జీవితాన్నింక నటించలేను
దీనితో రాజీపడలేను

ఆవర్ణాలు పగటి కలలై - కల్లలై
ద్వేషం కుటిలత్వం
స్వోత్కర్ష కపం కపాలంలో విండిన

—యాభైనాలుగు—

వ్యక్తులమధ్య
వ్యక్తిత్వ రాహిత్యంమధ్య
పెదాల వంకరల్లో చిరునవ్వులుచూపి
ఈ హిపోక్రసీ
ఈ తేలుకొండులమీంచి
నేన్నడవలేను
నిత్యదైనందిన సమస్యల్ని
భూతద్దంలో చూపిస్తున్న సమాజాన్ని-

ఇలా ఒక్కసారిచూడు
కలంలో సిరా ఇంకిపోయింది
ఈరాత్రి నడిచి
రేపు సూర్యుడు ఉదయిస్తాడని
కాలం చిగిరించి
సమానత్వం - మానవత్వం
సగటుగా పంక్తిభోజనం పెడతాయని
కాటుక అవసరంలేని కనురెప్పలకింద
ఏవో మిణుగురులు-
ఎల్లలు బద్దలై
వసుమతి బొడ్డు మసిచెరిగి-
గుండె లోతుల్లో ఇంధ్రధనుస్సు
పంచరంగులు మేళవించిన తెల్లటి తెలుపు
నీలా
అందంగా
అమ్మ చనుబాలలా-

—యాభై ఐదు—

ఆనందం
ఈ కమిలిన గుండెల్ని
కాలిన పెదాల్ని
ఒక్కసారి విమిరి
కళ్ళలో కొండెక్కుతున్న దీపాన్ని
దుమ్ముకొట్టి మాసిపోయిన మనస్సుని
ఒక్కసారి విదిల్చి-
నువ్వొస్తే చాలు
వసివాడినరేకులు తిరిగి పులకిస్తే చాలు

—యాభై ఆరు—

నరమాంసం రుచిమరిగి

ఓరేయ్!

మీరంతా ఊరపందుల్లా బతుకుతున్నారు
భవిష్యత్తు గురించి ఆలోచనల్లేవు
వర్తమాన వక్రగతిపట్ల విమర్శలేదు
అంట్ల వెధవల్లా
మొగుడుచచ్చిన ముండల్లా
మొగుడుచాటు పొరంబోకు లంజల్లా
బతికున్న శవాల్లా
చచ్చు పీనుగులు
ఎందుకురా మీరంతాబతికి

ఒరేయ్
కర్మ సిద్ధాంతోపన్యాసుల్లారా
సన్నాసుల్లారా
దున్నపోతుల్లారా
ఎందుకురా మీ బ్రతుకులు
పౌరుషం చచ్చి
ఎవడెవడోవచ్చి
నిన్నులాగి
నీ దేశంమీద

—యాభై ఏడు—

నీ బతుకుమీద
నీ పెళ్ళాంమీద
భయంకర పైశాచిక రతిసలుపుకుంటే
వెధవలాగ నోరెళ్ళబెట్టి నీతివాక్యాలు బోధించి
పురుషత్వం చచ్చి
కొజ్జాల్లా—

ఒరేయ్
మీరంతా డాఫరుమామలు
మీదంటూ మీకు బతుకులేదు
గతంలో తలలుదూర్చి
వెలిగే సూర్యుణ్ణి చూడ నిరాకరించి
భవిష్యత్తుని శాసింపజూస్తున్న
నిప్పుకోళ్ళు
నిఖార్సైన అసాధ్యులు
ఎందుకురా ఈ గానుగెద్దు జీవితాలు
మీ జీవితాలు మీరఘోషించడంకూడా చేతకాని వాజమ్మలు
ఎందుకురా మీరు బతికి
అరటిపండు ఒలిచినా నమిలిపెట్టినా
అరాయించుకోలేని అగ్నిమాంద్యపుపీనుగులు
మీకందరికీ మలబద్ధకం
మీ బతుకే మలబద్ధకం

ఒరేయ్
పేరుకి పెత్తనమిచ్చిన పెయ్యమ్మలూ

—యాభై ఎనిమిది—

మీ ఒంటిమీదిచర్మం బులబులాగ్గా ఒలిపించి
కారంపూసి
నిప్పులమీద దొర్లించి
మిమ్మల్ని కొడుతున్నారా?

—యా భైతొమ్మిది—

వుగ్రేయ్ వెధవయ్యా

గాదికింద పందికొక్కు
ఊరికంత పెద్దదిక్కు
సీనోట్లో - నా నోట్లో
అంకినోడి అంగుట్లో మట్టికుక్కు
తన ఇంట్లో ఇనప్పెట్లో
ఆలితెచ్చిన కావిడ్పెట్లో
బంగారం కుక్కు

బ్రహ్మంగారి సూక్తాలు
సుమత్యాది శతకాలు
భగవద్గీత శ్లోకాలు
శంకరుని భాష్యాలు
ఏకథాటి వల్లెవేసి
పుక్కిలించి ఉమ్మివేసి
గుడ్లురిమి చూసేసి
చిర్నవ్వు బిగించేసి
పెద్దచెయ్యి పేద్దగా
నెత్తిమీద పెట్టేసి
తిరుగులాడు చిట్టిబాబు
సంఘంలో చెలామణీ

—అరవై—

పెద్దమనిషి బడాబాబు
కల్లుతాగిన కోతిర
కాండవ నృత్యం అన్నాడురా
తాగి తందనా లాడాడురా

మాహాత్ముని సూక్తాలు
నిత్యపారాయణం చేసేసి
వంటింట్లో
నాలుగిళ్ళ చావిట్లో
సారాబట్టీ
సవ్యంగా కట్టేసి
చట్టానికి
నిర్మించిన చట్రానికి
చక్రవ్యూహం చుట్టేసి
నడివీధిలో రొమ్మిరిచిన పెద్దబాబు
అటు చూడర
ఆ పక్కన బద్దలైంది అగ్నిపర్వతం
ధినక ధినక తద్ధినక ధినక
తప్పెట్లు తందనాలు
నడిరోడ్లో సంబరాలు
నీ చుట్టూ కంపరాలు
నీ గుండెల్లో గునపాలు

ఓటిచ్చిన బుల్లోడికి
ఒడ్డూ పొడుగూ పైపెద్దోడికి

—అంపై ఒకటి—

ఒక్కసారి మొక్కేసి
మెత్తిరిగిన మీసం
ఓరచూవుతో ఒడేసి
చిన్ననవ్వు చిత్రింగా
పంటిసందో అదిమిపట్టి
గెల్చినాక గంతులేసి
ఓటిచ్చినోడి కాళ్ళుపట్టేసి
కిందగుంజి గొంతునొక్కి
కుక్కినవ్వు నవ్వేసి
నక్కిఏడ్పు ఏడ్చేసి
ఒక్కపెట్టు గోలచేసి
గోలుమాలు పెద్దబాబు
బండెలోడో పందికొక్కు

ధినక ధినక
ధిమ్మదిక్కి చెమ్మచెక్కి
నాటుసార గొంతుపట్టె
జనంచెయ్యి దురదబెట్టె
వీపుకాస్త పగులగొట్టె
ఈక్షణం నీకున్నది
మరోక్షణం
బతికుంటే బలిసాకు
పరుగెత్తు

కళ్ళుతెరచి కదంతొక్కి

—అరవై రెండు—

ఇనపముంతా పపుసనొచ్చె
లఘెత్తు

బంగారం దక్కలేదు
భమిడిపళ్ళెం పత్తాలేదు
క్షణముంటే
ప్రాణానికే దిక్కులేదు
ఉరకలెత్తు

మీయింటిపక్క వూరిక్కాలవ
పక్కోడి పొలం నింపేసి
మీ ఆవిడ్ని ఏడుప్రాకారాలమధ్య కూలేసి
ఏడు గ్రామాల్ని కాపలాఏసి
పక్కోడి పెళ్ళాన్ని
ఎదురింటోడి పడుసుకూతుర్ని
పక్కలోకి లాగేసి
పడువంలో మింగేసి
ఊరోళ్ళ ఏటపోతుల మ్మోరికి బలేసి
ఊరవతల మ్మోరిని నిలేసి
ఊరెక్కి ఊరేగిన పెద్దబాబు
నిజాన్ని ఉరితీసిన చిట్టిబాబు
మీయింట్లో మంతనాలు
మీ పెద్దమ్మాయి జులపాలు
పక్కింటి బుల్లోడి మురిపాలు
నీకో

—అరవై మూడు—

కుములుతున్న కములుతున్న
నువుసాకిన విషనాగులు విషకీలలు
నీచుట్టూ మంచుతున్న
దుశ్చేష్టలు బడబాగ్నులు
నిన్నే ముంచుతున్న
నువ్వో
విర్మించిన పాలించిన బురదగుంటలు

ధినక ధినక తద్ధినక ధినక
నిజం నిజం
నీ తలకే కొరివిబెట్టె

—అరవైనాలుగు—

పాపం నీ అడ్రసు దొరకటంలేదు

తల్లీ
కవితా కళామతల్లీ
నిజంగా ని అడ్రసు దొరకటంలేదా!

సాహితీ దురంధరులు
పండితమ్మన్యులు
రాజుగారి మెల్లకన్ను ప్రేయసిమీద
గొల్లపడుచు - బెస్తపడుచు అంగాల పొంగులమీద
నిన్ను నడిపించి
బండబూతులు సంస్కృతంలో నీనోట పలికించి
దాన్ని రసికత్వమని, రసకవిత్వమని
రణభేరీలతో చాటించి
పరస్పర స్తోత్కర్ష సంఘాలలో తాతాచార్ల ముద్రవేసి
గతకాలపు చూర్లుపట్టుకుని గబ్బిలాల్లా వేళ్లాడుతూ
కోట్లాదిజనం గుండెల్లో మండుతున్న మంటల్ని
వారి కళ్ళల్లో కొడిగడుతున్న ఆశల్ని
వారిలో పసిబారుతున్న మానవత్వాన్ని
వారి అణువణువునా బద్దలవుతున్న అగ్నిపర్వతాలనీ
లావాలా సెగలు పొగలు కక్కుతున్న నిత్యనూతన సత్యాల్ని
గుర్తించక

గతంలో ఎక్కడో దారితప్పిన వీళ్ళకి
ఏ అయినింటి జారిజీ నిమ్మోన్నతాలలోనో
నిన్ను సజీవంగా బంధించామని విర్రవీగుతూ
బానిసత్వంతప్ప, స్వేచ్ఛరుచి ఎరుగని ఈ పీతాంబరులకి
నవసమాజం వద్దు, సవతవద్దు
నాణ్యమైన జీవనంవద్దు
మార్పువద్దు, మారవద్దు
అంటూ కళ్మల భూయిష్టమైన కూపస్థాలలో
తమ జీవనం గడిపేస్తూ-
ఆ బురదతో నీ ఒంటికి సుగంధలేపనాలుచేసి
ఎపు పాశవిక పర్రివృత్తుల్ని నీకు ఆభరణాలుగా వేసి
తెలుగుసీమని కలకాలంగా
నిజంగా పాపం చాలాకష్టపడి
తెగులుసీమగా తయారుచేసి
తెలుగుసీమకి ఆమడదూరంలో
బురదకంపు కొడుతున్న
పర్రితిభని, పర్రితిష్ఠని
అతిభదర్రింగా కాపాడుకొంటూ
ఏ బురదగుంటలోనో కూరుకుపోయిన వీళ్ళకి
నీ అవర్రిసు దొరక్కపోవటంలో ఆశ్చర్యంలేదు

అవును
పెదబాలశిక్షతప్ప మరేదీ తెలియక
మందకో గొర్రెల్లా
ఉత్తర దక్షిణాలు తెలియక

— ఆరవై ఆరు —

తమడునికి తాము తెలుసుకోలేక
విశ్వరూపం దాల్చిన నిన్ను పోల్చుకోలేక
మారుతున్న కాలాన్ని గుర్తించలేక
తాము విసర్జించిన కళ్మలంతో
తమ భావిని పూడ్చుకొంటూ
పిచ్చికేకలు పెడుతున్న పీళ్ళకి
పాపం, నీ అడ్రసు దొరకటంలేదు

జనం గుండెలు కుతకుత ఉడుకుతుంటే
నిత్యదైనందిన సమస్యలు పెనుభూతాల్లా పీక్కుతింటుంటే
నట్ట నడివీధిలో బాహాటంగా మానభంగం చేస్తుంటే
మానవుడు మానవత్వాన్నిమరిచి పశువుగా మారుతుంటే
మాటకు విలువతప్పి
మమతకీ, మంచితనానికీ మనుగడతప్పి
అడుగడుక్కీ నరాలు, ప్రేగులు, మెదళ్ళు తూట్లుపడుతుంటే
ఈ కుహనా కవిసామ్రాట్టులు
ఈ అభినవ కవిరాజులు
ఈ భట్రాజులు
ఈ నాయకమ్మన్యులు
ఈ మత దురహంకారులు
ఈ స్వార్థపరులు
విజాయితీని విసర్జించిన ఈ సీచులు
వాళ్ళ సొంతగొడవల్నీ, ఆర్తనాదాల్నీ
యుగయుగాల భారంగా
నీమీదమోపి

—అరవైఏడు—

చైతన్యంలేని చేతనా వర్తాలలో నిన్ను బం
ని బుతువకార్మిలు బాహాబంచేసి
విరిగిన వజ్రాయుధాలతో
పగిలిన శంఖారావాలతో
విశాలాంధ్ర నిండా
మాచకమ్మలైన కూనలమ్మల్ని వదిలి
చలిచీమల్లా, చెదపురుగుల్లా
జనతలో వ్యాపించి పీక్కుతింటుంటే
నిత్యనూతన స్రవంతివై, కారుణ్యవల్లివైన నీకు
ఆ ఆర్తనాదాలు వినిపించకూడదని
మానవుణ్ణి అథఃపాతాళానికి అణగదొక్కి
నిన్ను తమకీర్తి దుర్గంధపేటికల్లో బంధించి
ఎన్ని లక్షల అగ్నిపర్వతాలు గుండెల్లో బద్దలైనా
ఎన్ని కోట్ల దుష్టదుశ్శాసనులు మానభగం చేస్తున్నా
నీదిక్కే ఆర్తితోచూస్తున్న మాకూ
బంధాల్ని ఛేదించ యత్నిస్తున్న నీకూ
నీతి వాక్యాలూ
ద్రౌపదీ సావిత్రుల పతివ్రతా ధర్మాలూ
బోధిస్తూ
నిన్ను నిజంగా
కళావతు రాణీగా
గజ్జెల గుర్రినివిగా
నకిలీ నైతానుగా
చివరికి

—తరువాయి ఎనిమిది—

వెధవముండలా
మాచ్చారు

కానీ నువ్వు
దాస్య శృంఖలాలను తెంచుకుని
నిత్యనూతనంగా, దుర్నిరీక్ష్యంగా
నిలబడి
నీవారి ఆశలు నీలో ప్రతిబింబించి
వారి గుండెల్లో కరడుగట్టిన కష్టాలు కరిగించి
వారి కళ్ళలో కొడిగట్టిన సూర్యుల్ని ప్రజ్వలించి
"కళ ప్రజలకోసం
కవిత్వం ప్రజలకోసం
ప్రజల ఘోషలు ప్రతిధ్వనించేదీ
ప్రజల ఆశలు ప్రతిఫలించేదీ
క్రాంతిమార్గం చూపించేదీ కవిత్వం"
అంటూ దిక్కులు ప్రతిధ్వనిస్తూ
తుమ్మకంపల్నీ, కలుపు మొక్కల్నీ
కూకటివేళ్ళతో పెకలిస్తూ-
సర్వమానవాళి జీవనం సస్యశ్యామలం గావిస్తూ
జలపాతంలా దూసుకవస్తున్న
నిన్ను జూసి
భయభ్రాంతులై
బతికుంటే బలుసాకంటూ
మీసాలు గొరిగించుకుని
పేడులై

—అరవై తొమ్మి' —

కకావికాలుగా
దిక్కులు తెలియక
పిక్కబలం చూపెడుతున్న
వీళ్ళందరికీ
పాపం
ఎంత వెదకినా
ఎక్కడ వెదకినా
ఎదురుగా నిల్చిన
ఏ అడ్రసు దొరకటంలేదు

ఠా—

క్షణం క్షణం ప్రతిక్షణం

అనిపిస్తూ వుంటుంది
మనకి స్వాతంత్ర్యం రాలేదని
విసిరిన ఎంగిలి విస్తర్ని
రెండు కుక్కలు పంచుకున్నాయని
విసిరినవాడి పాదాలు నాకుతున్నాయని

అవును

నిజంగా ఆలోచిస్తే
మనకి స్వతంత్ర్యం రాలేదు
ఎవడో విదిల్చిన చద్దికూడుతింటూ
మరెవడో ఉమ్మేసిన ఎంగిలికూడుమేసి
స్వతంత్ర్యులం మనం
ఇరవై మూడేళ్ళుగా స్వాతి చినుకులకోసం ఎదురుచూస్తున్నాం
పడుతున్న ఎంగిలి తుంపర్లకే మురిసిపోతున్నాం
నిజంగా
మనమంతా వెధవల్లా బతికేస్తున్నాం

నాన్నలూ, తాతలూ
తుపాకీగుళ్ళు గుండెలతో తిప్పికొట్టారని
జాతి జాతంతా, దేశమంతా ఒక్కటై

—డెబ్భయికిటి—

భరతమాత శరీరంమీద ఒక్క రక్తబిందువుకూడా పడలేదని
గర్విస్తూ
భగత్‌సింగుల్నీ, అల్లూరి సీతారామరాజుల్నీ
కన్వీనియంట్‌గా మర్చిపోతూ
జాతినీ, దేశాన్నీ
నుసిగానో, మసిగానో చేసేస్తూ
భరతమాత గర్భంలో అంతర్గత రక్తస్రావం గావిస్తూ
మనమంతా ఉష్ట్రపక్షుల్లా గతంలో బతికేస్తున్నాం

మన వెకిలిచేష్టలకీ - చేతకాని తనానికీ
మన ఆడంగి వేషాలకీ
గీతనో దేమున్నో అడ్డేసుకుని
నిజంగా మనమంతా కొజ్జాలం
సొంతంగా ఆలోచించాలంటే భయం
అన్యాయాన్ని ఎదుర్కోవాలంటే భయం
తిరగబడాలంటే భయం
మన కర్తవ్యాన్ని మరిచిపోయి
ఎదుటివాడికి విధినిర్వహణ గురించి
ఉపన్యాసాలిస్తూ
నంగిరి వెధవల్లా నవ్వేస్తున్నాం
మనంచేసే
ప్రతి అడ్డమైన తప్పుడుపనికీ
దేశాన్నీ, ప్రభుత్వాన్నీ
మనల్ని మనమే తిట్టుకుంటున్నాం
తిరుగుబాటుమటుకు చేయం

—దెబ్బై రెండు—

ఇలాచూడు బాబీ
లేచికూర్చో
గతించిన వీరగాథల సుషుప్తిలోంచి
ముట్టెత్తిన స్వాతంత్ర్యపు మత్తులోంచి
మత మఠాధిపతుల తిలకాష్ఠమహిష బంధాల్నుంచి
రాజకీయాల రొచ్చులోంచి
సాహితీ స్రాగ్రాట్టుల్నుంచి
నిన్ను నువ్వు విడదీసుకుని
ఒక్కసారి లేచికూర్చో
నీ ఇరవైమూడు సంవత్సరాల స్వాతంత్ర్యతని
ఈ పిండాన్ని
కుళ్ళిపోయిన వారవనితని
ఈ ఛండాలాన్ని విదుల్చుకుని
ఒక్కసారి
నీగుండెల్ని పిండుకునిచూడు
బురదలో ఆడుకుంటున్న నీజాతిని
మెయిన్‌రోడ్ పేవ్‌మెంటుమీది అభద్రాన్ని
"ఒక్కతూరికి పావలా" సందులో బేరంపెట్టిన అందాన్ని
మనిషికీ-కుక్కకీ భేదంచూపని
చెత్తకుండీదగ్గర ఎంగిలి విస్తర్ని
అక్కడే
రక్షకభటుని రక్షణలోకూర్చున్న మూడు ముక్కల్నీ నవారు
బద్దీని
పిడికెడు మెతుకులకోసం పసిపాప కళ్ళలో జిల్లేడుపాలు పోసిన
తల్లిని

—దెబ్బమూడు—

తన అనుచుల్లో నడుస్తున్న యీ గొర్రెలమంద చేష్టల్ని
ఆరడుగుల సింహాసనంమీంచి
సగర్వంగా-తీవిగా చూసుకుంటోన్న
బతానాయకుని కంచువిగ్రహాన్ని
నిజంగా ఆలోచినే
మనకొచ్చింది స్వాతంత్ర్యమా
నత్తసావలామార్కు రాజకీయ కుతంత్రిమా!?
మన జీవితాల్ని మరొకడికి తాకట్టుపెట్టి
మనల్ని మనమే
నాయకులకీ నాగుబాములకీ
మతాధిపతులకీ మదించిన దున్నపోతులకీ
తాప్పుకుంటున్న ఈ జీవితానికి స్వస్తి ఎప్పుడు?
ఎప్పుడు మనం మనుషులుగా తిరిగిజీవించేది?
చీమూ నెత్తురూవున్న చైతన్యవంతులుగా గుర్తెరిగేది చరించేది?

ఆలోచించు బాబ్జీ
నీ ఎముకల్ని అనునిత్యం కొరుక్కుతింటున్న పరిచిన్నసమస్య
గురించి

నీ వ్యక్తిత్వాన్ని బిత్తలబజార్లో కీడుస్తున్న పరితి సంఘటన
గురించి

నీ పరిత్యణువూ నిఘార్పైన విషగుళికగా మారుస్తున్న పరితి
నికృష్టుడి గురించి

ప్రాంతీయ ముఠావాదాలతో భాషావిభేదాలతో
నిన్ను పిశాచిగామారుస్తున్న పరితిక్రాష్టుడిగురించి

— తెలైనాలగు —

ఓ అఖిలభారత పౌరుడా!
లే
పరిభంజనంలా - పరిణయఘోషలా
ముంచెత్తే కెరటంలా
ఈ కలోలిత వరమానంలోంచి
రెండుకళ్ళూ మనసూ పూర్తిగా తెరుచుకుని
చూడు
నీదేశ సమ్యక్స్వరూపాన్ని

అటుచూడు
ఆ పైశాచిక తాండవాన్ని
రాజకీయాల రొచ్చులో రొంటివరకూ కూరుకుపోయి
తామే గావించిన బురదలో పొర్లాడుతూ
తమ కళ్మలాన్ని తామేతింటూ
నిన్నూ నన్నూ ఆబురదలోకి లాగుతూ
చిదానందంగా తిరుగుతున్న పందుల్ని
వాళ్ళకి
నువ్వూ నీ సమస్యలూ భారతరులేదు
రాళ్ళలో బియ్యం ఏరుకున్నా
ఇల్లాలి మంగళసూత్రం తాకట్టు పెట్టినా
పదిరూపాయలతో కొనగలిగే
నీ అయిదు సంవత్సరాల జీవనిసత్వం
ఆపైన నువ్వు బతికున్నశవానివి

తెలుసు కొబ్బీ:
నువ్వు తిరగబడవని తెలుసు

— రెప్పైదు —

ఇంతకాలం నువ్వు నవుంసకుడివిగా బతికావనే తెలుసు
అందుకే
రెండువేల సంవత్సరాలుగా
అహింసా మత్రింతో ఉస్సూపాతరేస్తున్నారు
తల పై కెత్తకు బాబీ
బుద్ధుడిదో మరోదద్దమ్మదో సూత్రాలు నీగొంతులోపోసి
నీ ఒంటిమీద చర్మం ఒలిచి
ఛీ ఛీ ఇంకా ఇంకా
ఎంతకాలం మీ నిస్తబ్ధత
ఎంతకాలం మోస్తావీ పారసైట్స్‌ని
కొన్ని శతాబ్దాలుగా
నిన్ను నల్లమందులా ఆవరించిన దానిసత్వపుమత్తు
ఇంకా నిన్ను వదలలేదా
ఒక్కపూట అర్ధకలి తీరుతుందని
ఒక్కమంత కల్లుదొరుకుతుందని
గతించిన భయంకర అనుభవాలుమరిచి
తిరిగి
ఈ ఎద్దులకీ తోడేళ్ళకీ
నిన్ను నువ్వు ఆహారం చేసుకుంటున్నావా
అల్పసంతోషివా బాబ్జీ
ఆహా! ఎంతచక్కగా ఎంత సులభంగా
నిన్ను నువ్వు మోసగించుకో గలుగుతున్నావు!
ఈ పందులు
ఈ తప్పుడు పుట్టకైన పందులు

—దెభ్భైఆరు—

ఇది నా దేశం అంటూ అరుస్తున్న
ఈ తినమరిగిన పందులు :
నీ జాతికి వంధ్యకార్యచేసి
నీజాతి పీపుమీదెక్కి
కక్కి లఘుశంకలు దీర్ఘ శంకలు తీర్చుకుని
తిరిగి అవే ఆహారం చేసుకుని
అదే మన సంస్కృతని
అశ్మరభ శరభ అంటూ
పర్విపంచపు వాడవాడంతా చాటి
దొరికిన చెప్పుదెబ్బలూ ఖాండ్రించిన ఉమ్మ్లలూ
మూటగట్టుకుని
మనదేశపు గౌరవం ఇనుమడిస్తోందని
ఏకగ్రీవ తీర్మానాలుచేసి
ముష్టెలు నాక్కుంటూ
ముష్టి వాసనచూసుకుంటూ
చంకలు గుద్దుకుంటూ చంకలు పిసుక్కుంటూ
సైర్వరవిహారంచేస్తున్న పందుల్ని
నీ దేశాన్ని
ముక్కలు చెక్కలుగా అమ్మకతింటున్న
ఈ నస్మరంతి గాళ్ళని
తల్లిని మానభంగంచేసే కిరాతకుల్ని
ఇంకా ఎంతకాలం మేపుతావు దాజీ!
నిజంగా ఆలోచించు
మనకొచ్చింది స్వాతంత్ర్యమేనా?

—దెప్పైవీడు—

పోనీ ఇలాచూడు
మహామహులు సాహితీ సామ్రాట్టులు
జాతి వైతాళికులు
విశిష్ట సభ్యత్వాలకోసం
అగాధమీల ఆమోద ముద్రకోసం
వరుసగాపెట్టే తద్దినప్పిండాలకోసం
పరస్పర కుచమర్దనలు చేసుకుంటూ
రాష్ట్రీ-రాష్ట్రీ, గ్రామే-గ్రామే హంగదర్లవి పెంచుతూ
రాజకీయ పందుల ఒంటిబురదనీ
వెండితెర వెలి బూడిదల్నీ
వారి పాదాల్నీ తదితరాల్నీ
సహస్రనామార్చన చేస్తూ
వారి నామాల్నీ మానాల్నీ
నిత్యపారాయణం గావిస్తూ
నాపసానుల్లా బతుకుతున్న
చిదానందమూర్తుల్ని చూడు
వారికి
నువ్వూ నీ అర్ధాకలి పేగులూ
నీ జీవితంలో చిరుగులూ
నీ ఆశలపందిరినిండా చీడపురుగులూ
ఇవేవీ కన్పించవు
పిరంగిగుళ్ళూ-పిరియురాలి ఛాతీపొంగులూ
ఒకేరీతి వర్ణిస్తూ
నీ దైన్యాన్ని తమ మాన్యాలు పెంచుకునే
మూలధనం గావిస్తూ

—డెభ్భైఏనిమిది—

సిల్క్ చొక్కాలలోనూ - జవిరి గెడ్డాలలోనూ
తమకీర్తి కుతినిదాచుకుంటూ
ఊరకుక్కల్లా చొంగలు కార్చుకుంటూ
తిరుగుతున్న ఈ అభినవ కవికిశోరాలు
వీళ్ళు ఈ బతికున్న శవాలు
వీళ్ళందరూ
నిన్ను

తమ భయంకర కీర్తికాముకత్వానికి బలిచేస్తున్నారు
బాబ్జీ!
ఇంకా ఎంతకాలం ఒంగినడుస్తావు?

అటుచూడు
నాచులా దేశమంతటా వ్యాపించిన మతాధిపతుల్ని
రకరకాలు
స్వాములు, సన్యాసులు, బాబాలు, పీర్లు, ఫాదర్లు, మౌల్వీలు
నీ సరాలమీద
నీ మౌఢ్యాలమీద
నీ ఆవేశాలమీద
బతుకుతున్న పందికొక్కులు
నీ మనసుచుట్టూ - ఆలోచనలచుట్టూ
అణుధూళిలా ఆవరించి
కావేషాలు రెచ్చగొట్టి
ఎముకకోసం, వెంట్రుక ముక్కకోసం
నిన్ను బొమీదకితోసి
నీ ప్రాణాలు పణంగాపెట్టి

— దెబ్బతొబ్బిది —

నీ సోదరుని కుత్తుక నీచేతులతో ఉత్తరించి
నిన్ను మనిషినితప్ప మరేదోచేసి
సర్వమానవతా వాదాన్ని
మతంతో వడగొట్టి
నిన్ను నపుంసకుణ్ణి చేస్తున్నారు బాబ్జీ
విద్రోహించిలే
ఈ పాషండుల్ని పరిమార్చి
మానవత్వం మంటగలవకుండా చూసుకో

పోనీ, అటుచూడు
విద్యాలయాలకేసి
సంఘాన్ని, భావిభారత భాగ్యవిధాతల్ని తీర్చిదిద్దాల్సిన
మహామహులు, సమున్నత విద్యాధికారులు
తమ స్వార్థపరత్వంకోసం
తమతమ పదవుల అస్తిత్వం కోసం
పరస్పర కీచులాటలలో
నిన్నూ, నీ వారసుల్నీ సమిధలుగా చేస్తున్న
చిద్విలాస మూర్తుల్ని చూడు
తెరచాటు భాగోతాలలో
ఆధిక్యతని ఆపాదించుకుని
ఒకటో ఆరో నిజాయితీ గుండెల్ని గునపాలతో కుళ్ళపొడిచి
విశ్వవిద్యాలయ కర్మాగారాల్లో
గొర్రెల్నీ, తోడేళ్ళనీ ఉత్పత్తిచేసి
దేశంమీదికి వదుల్తున్న విద్రోహుల్ని చూడు
వీళ్ళందరూ కలిసి

— ఎవరై —

నీ వారసుల మెడళ్ళు వీడుపెట్టి
బంజరు భూముల్ని చేస్తున్నారు
పాలకుండలో విషాన్ని చిలికిస్తున్నారు
సిద్ధాన్ని నేలమట్టం చేస్తున్నారు
వీళ్ళందరూ ఇంకా ఏన్నేదో ఉద్ధరిస్తాడని కుడుస్నావా?
వీళ్ళందరూ నీ జాతినేదో మహోన్నత శిఖరాలపైకి తీసుకపెళతా
రనుకుంటున్నావా?

నిజమే
తప్పక తీసుకువెళతారు
బలిపీఠానికి!
ఆదిలోనే
నీ వ్యక్తిత్వం మొలకెత్తే తొలిమేళ్లోనే
నీ విత్తులకొట్టి
బీజ!
అనాడు
తనపబ్బం గడవటానికి
తనకింద గులాములుగా శాశ్వతంగా ఉంచుకోటానికి
అతి చాకచక్యంతో
ఎంగిలివిస్తర్ని విడిల్చినవాడు నిర్ణయించిన విధానాన్ని
అతిభద్రంగా కాపాడుకుంటూ
దానికి మరిన్ని మెరుగులుదిద్ది
విన్ను తరతరాలుగా జానిసలుగా వుంచటానికి
వీళ్ళు
ఈ జాతిహంతకులు

— ఎన్ శైలజ —

తమ మేధాశక్తిని ఉచితంగా త్యాగంచేస్తున్నారు
అర్థాకలి నింపలేని పట్టాలని
అవసరానికి పనికిరాని విజ్ఞానాన్ని
నీ మెదళ్ళలో జొప్పించి
చిత్తరపోయిన క్షణంలో నిన్నుకాటేసి
నీ కోరలు పీకుతున్నారు

ఈ విద్యాలయాల్లో
ఆలయంలో శక్తిలా విద్యలేదు
ఆలయాన్ని పట్టుకుని వేళ్ళాడే గబ్బిలాల్లా
ఈ కుహనా విద్యాలంకారులు
ఈ అతితెలివి పండితులు
ఈ పరాన్నభుక్కులు
ఈ సగంతెలివి సన్నాసులు
విద్యాపీఠాలవిండా నిండి వటలక
చెదపురుగుల్లా
నీ మేధస్సుని చెడతింటున్నారు

ఇలా ఇలా
ఎందరో మరెందరో మహామహులు
మహానుభావులందరూ కలిసి
మహా మహోత్సాహంతో
నిన్ను ఎముకల్తోసహా చప్పరిస్తున్నారు
బాబీ
ఇక ఉపేక్షించి లాభంలేదు
లేవాలి

—ఎగభై రెండు—

ఇరవై మూడేళ్ళుగా నిద్రిపోతున్నావు
అంతకుముందేదో కొంతకాలం
నీ తండ్రిలూ, తాతలూ లేచినిలబడ్డారు
ఆ సంరంభంలోనే నువ్వు పుట్టావు
పుట్టినప్పటినుంచీ
అదేంఖర్మో
మైలబట్టలా మూలపడే వున్నావు
లేవరా!
లే!!!
నువ్వు లేవకతప్పదు
నీచుట్టూ
ఈ మండ్రిగబ్బలూ, కొండచిలువలూ, తోడేళ్ళూ
నిన్నెలా పంచుకుతినాలా అని
శిఖరాగ్ర సమావేశాలు జరుపుకుంటుంటే
నీ తొడలమధ్య
చెదపురుగులు వెన్నెలవిందు చేసుకుంటుంటే
నీ గుండెలమీద
రాబందులు అల్పాహారవిందు సేవిస్తుంటే
నీ రక్తాన్ని సిప్‌చేస్తూ నిన్ను బుజ్జగిస్తుంటే
ఇంకా ఇంకా
నీ సుప్తాస్థికలు మేలుకోవటం లేదా?
నీ కందరాలలో చైతన్యం కలగటంలేదా?
ఇంకా నువ్వు స్వతంత్రిడవనే భావిస్తున్నావా?
ఈ కుహనా స్వాతంత్ర్యాన్ని
ఈ మేడిపండుని

—ఎనభై మూడు—

దాబ్జీ:
ఈ అగ్నిపర్వతం బద్దలవక తప్పదు
దానికి నువ్వూ నేనూ ఇంధనం కాకతప్పదు
ఈ రాక్షసరాజ్య విధ్వంసం వద్దన్నా ఆగదు
నువ్వూ నేనూ మేలుకోకుంటే
మన ముందుతరం మనల్ని క్షమించదు
పద నాతో
పరిపూర్ణ స్వాతంత్ర్యాన్ని సిద్ధించుకోటానికి
సుస్థిర మానవ సామ్రాజ్యాన్ని స్థాపించుకోటానికి
వ్యక్తిని వ్యక్తిగా గుర్తించి
ఈ నరరూప రాక్షసుల్ని నాశనంచేసి
మానవతకి తప్ప మరే మతానికీ తావులేని
మహోన్నత లోకాన్ని సృష్టించుకోటానికి
ఐలంగొ అడుగు ముందుకువేద్దాం పద

రా

—ఎవ్ హైనాలగు—

RSK01Z145

94

RAA

by

BHAIRAVAYYA

Rs. 2-50

For Copies :

SPANDANA DISTRIBUTORS

1-8-17/2, CHIKKADPALLI :: HYDERABAD-20 (A. P.)

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	RSK07-E145
పుస్తకం పేరు	లం భైరవమ్మ
తారీఖు	20/6/2023
ముందు అట్ట	ఉంది
వెనుక అట్ట	ఉంది
మొత్తం పేజీలు	97
పెద్ద సైజు పేజీలు	లేవు
ఖాళీ పేజీలు	C1, 93
లేని పేజీలు	లేవు
తయారు చేసినది	Chaithanya Hema
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	
పరిస్థితి	

PRAGATHI